క్లుప్తంగా

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, అమరవాయి చింతలాముని నల్లారెడ్డిస్వామి వార్ల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదిశిలా క్షేత్రం, సద్దలోనిపల్లి కృష్ణస్వామి ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

ఉండవెల్లి: మండల కేంద్రంలోని కంచుపాడు నుంచి కర్నూల్‌కు ప్రయాణిస్తున్న ఆటోలో అక్రమంగా 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. శనివారం కంచుపాడు నుంచి కర్నూల్‌కు ఆటోలో 5 క్వింటాల బియ్యం తరలిస్తుండగా బ్లూకోర్టు పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. కర్నూల్ జిల్లా పెద్దపాడుకు చెందిన ఆటో డ్రైవర్ కమ్ ఓనర్ అశోక్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని ఆటోను సీజ్ చేశారు. ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

మల్దకల్ ఏపీఓగా సుజాత

మల్దకల్: ఉపాధిహామీ ఏపీఓగా సుజాత శనివారం బాధ్యతలు చేపట్టారు. మల్దకల్‌లో పని చేస్తున్న ఏపీఓ సౌజన్య ఉండవెల్లికి బదిలీపై వెళ్లగా అక్కడ పనిచేస్తున్న సుజాత మల్దకల్‌కు బదిలీపై వచ్చారు.

ఇన్‌చార్జి ఏఎల్‌ఓగా వేణుగోపాల్



గద్వాల అర్బన్: వనపర్తి జిల్లా కార్మికశాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్(ఏఎల్‌ఓ)గా విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్‌ను జోగుళాంబ గద్వాల జిల్లా ఇన్‌చార్జి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న మహేష్‌కుమార్ నారాయణపేట జిల్లాకు బదిలీ అయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా మహేష్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ముస్తాబైన ఆలయాలు

అయిజ: గురు పూర్ణిమను పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు చేసేందుకు మండల కేంద్రంలోని అయ్యప్ప, సాయిబాబ ఆలయాలతో పాటు గుంతరామలింగేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం ముస్తాబు చేశారు. గురు పూర్ణిమ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలి రానుండడంతో వారికి కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశారు.

రోడ్లన్నీ జలమయం



ధరూరు: మండలంలోని నెట్టెంపాడు గ్రామంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆయా కాలనీల్లోని అంతర్గత రోడ్లు వర్షపు నీటితో నిండాయి. సీసీ రోడ్ల నిర్మించినా అధికారులు డ్రెయినేజీలు నిర్మించలేదు. దీంతో మురుగుతో పాటు వర్షపు నీరు రోడ్లపై నిలిచి గ్రామంలో పాదచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తోంది. అధికారులు స్పందించి వర్షపు నీరు వెళ్లేలా మార్గం చూపించాలని కోరారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఎర్రవల్లిచౌరస్తా: పంటల సస్యరక్షణలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడి సాధించవచ్చని ఏఈఓ భరత్ అన్నారు. శనివారం ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అధిక వర్షాలతో మొక్కజొన్న పంటలో బ్యాక్టీరియా వల్ల కాండం కుళ్లు, మొదలు కుళ్లు తెగులు సోకిందని ఏఈఓ తెలిపారు.

లక్ష్యం నెరవేరేనా?



చాగాపురంలో ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ (ఫైల్)

- జాడలేని మినీ భూసార పరీక్ష కేంద్రాలు
- 2018లో క్లస్టర్‌కి ఒకటి చొప్పున మంజూరు
- వివిధ సమస్యలతో ఏర్పాటులో జాప్యం
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



షేకుపల్లిలో పరీక్ష కోసం మట్టిని తీస్తున్న రైతులు

ఎర్రవల్లిచౌరస్తా: భూసార పరీక్షలపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో పంటలకు అవసరం లేని ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తున్నారు. దీనివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోవడమే గాక ఆశించిన స్థాయిలో దిగుబడి పొందడం లేదు. దీనికి తోడు భూమిలో ప్రతి ఏటకు కర్బన శాతం అమాంతం తగ్గిపోతోంది. గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఒకే భూసార పరీక్ష కేంద్రం ఉండేది. రైతుల నుంచి సేకరించిన మట్టి నమూనాలు అధికారులు అక్కడికి పంపేవారు. పరీక్ష కేంద్రం నుంచి రిపోర్టు రైతులకు అందేందుకు చాలా సమయం పడుతుండేది. దీంతో రైతులు పరీక్షలు చేయించేందుకు ఆసక్తిని కనబర్చడం లేదు. ఈ విషయాన్ని గుర్తించిన గత ప్రభుత్వం ప్రతి క్లస్టర్‌కి ఒకటి చొప్పున మినీ భూసార పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా 2018 లోనే ఆయా క్లస్టర్లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించింది. దీనికి సంబంధించిన కిట్లను ఆయా క్లస్టర్లకు గతంలోనే సమకూర్చింది. గదుల కొరత, విద్యుత్, తదితర సమస్యల కారణంగా కొన్ని క్లస్టర్లలో ఏర్పాటు చేయలేదు. మరికొన్ని క్లస్టర్లలో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసినా అవి కొద్ది రోజులు మాత్రమే పనిచేశాయి. దీనివల్ల అన్ని క్లస్టర్లలోని కిట్లన్నీ ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి.

ఆయా మండలాల వారీగా క్లస్టర్ల వివరాలు

మండలం	క్లస్టర్లు
ఇటిక్యాల	12
మానవపాడు	7
అలంపూర్	5
ఉండవెల్లి	7
రాజోళి	6
వడ్డేపల్లి	5
అయిజ	11

పైలెట్ గ్రామాల ఎంపిక..

సేంద్రియ సాగు చేపట్టాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా అవసరం. అలంపూర్ నియోజకవర్గంలో మొత్తం 53 క్లస్టర్లు ఉండగా, ప్రభుత్వం భూసార పరీక్షల కోసం పైలెట్ ప్రాజెక్టుగా 7 మండలాల నుంచి ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి ఫలితాల నివేదికలను అందించాలని వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మినీ భూసార పరీక్ష కేంద్రాలు వినియోగంలో లేకపోవడంతో వారు మట్టి నమూనాలను సమీపంలోని ల్యాబరేటరికి పంపించి ఫలితాలు రైతులకు అందించారు.

రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు..



మండల కేంద్రాల్లో భూసార పరీక్ష కేంద్రాలు లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంటల సాగుకోసం మండలంలోని రైతులు పొలంలోని మట్టిని సేకరించి 100 కిలోమీటర్ల దూరంలో గల జడ్చర్ల ల్యాబ్‌కు పంపిస్తున్నారు. అక్కడి నుంచి రిపోర్టు రావడానికి ఎంతో సమయం పడుతుంది. ఒక్కోసారి రిపోర్టులు కూడా సక్రమంగా రావడం లేదు. దీనివల్ల చాలా మంది రైతులు భూసార పరీక్షలు చేసుకోవడమే మానేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతి క్లస్టర్లో తప్పకుండా భూసార పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

– రవికుమార్, రైతు, కారుపాకుల

రైతు వేదికల్లో ఏర్పాటుకు చర్యలు



రైతులు భూసార పరీక్షలు మూడేళ్లకు ఒకసారి తప్పకుండా చేయించాలి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో మాత్రమే భూసార పరీక్ష కేంద్రం ఉంది. ప్రభుత్వం గతంలో మినీ భూసార పరీక్ష కేంద్రాలను మంజూరు చేసినా, గదులు, విద్యుత్ వంటి సమస్యల కారణంగా సెంటర్లను ఏర్పాటు చేయలేదు. ప్రతి క్లస్టర్లలో ఏర్పాటు చేసిన రైతు వేదిక భవనాల్లో భూసార కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

– సక్రియ నాయక్, ఏడీఏ, అలంపూర్

భూసార పరీక్షలతో లాభాలు..

రైతులు పంట పొలాలకు భూసార పరీక్షలు చేయడం వల్ల పొలాలు ఏ పంటలకు అనుకూలంగా ఉంటాయో తెలుస్తుంది. వేసిన పంటలకు ఏయే ఎరువులను ఎంత మోతాదులో వాడాలో తెలుస్తుంది. రైతులు వేసిన పంటలకు అనవసరమైన ఎరువులను మాత్రమే వాడి ఆర్థికంగా నష్టపోకుండా ఉండవచ్చు. ముఖ్యంగా రైతులు పంట ఖర్చులను తగ్గించుకోవడంతో పాటుగా భూసారాన్ని అధికంగా పెంచుకోవచ్చు. రైతులు ఆర్థికంగా నష్టపోకుండా అధిక దిగుబడి పొందే అవకాశం ఉంటుంది.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- సీడీపీఓ కమలాదేవి



మల్దకల్‌లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న సీడీపీఓ కమలాదేవి

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీడీపీఓ కమలాదేవి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. అమ్మమాట–అంగన్‌వాడీబాట, సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని శనివారం మల్దకల్ అంగన్‌వాడీ కేంద్రం-2లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో రెండున్నర సంవత్సరాలు దాటిన చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, టీచర్లు సురేఖ, మహేశ్వరమ్మ, లక్ష్మీరంగమ్మ, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: 'అమ్మ మాట – అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్ -1లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి, హెచ్ఎం జోత్స్న హాజరయ్యారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వీరమ్మ, వజ్రమ్మ, రజీయ, జయమ్మ పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని అమరవాయిలో ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రాజెక్ట్‌లో 238 సెంటర్లలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లలో పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తూ భరోసా ఇస్తున్నట్లు అంగన్‌వాడీ సూపర్ వైజర్లు సంధ్య, వాసంతిలు పేర్కొన్నారు. అమ్మబాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా గట్టు, మిట్టదొడ్డి గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంధ్య, అంగన్‌వాడీ టీచర్లు వెంకట్రావమ్మ, ఉమామహేశ్వరి,సుజాతమ్మ, సరస్వతి, రాజేశ్వరి, ఉష పాల్గొన్నారు.

శాంతినగర్: అంగన్‌వాడీకి వచ్చే చిన్నారులతో టీచర్లు స్నేహపూర్వకంగా ఉంటూ వారికి విద్య బోధించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటేశ్వరి అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులతో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీదేవమ్మ, శ్రీదేవి, సునీత, జయలక్ష్మి, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కైలాస్, సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్, సిబ్బంది, సోషల్ మొబలైజర్ లత పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎమ్మెల్యే



ఉండవెల్లిలోని పాఠశాలకు సీసీ కెమెరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలకు సీసీ కెమెరాలు అందజేశారు. శనివారం సీసీ కెమెరాలను ఎమ్మెల్యే విజయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము చదివిన పాఠశాలకు పూర్వ విద్యార్థులు సీసీ కెమెరాలు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏదైనా సమస్యలు తలెత్తితే సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. పాఠశాలకు 4 సీసీ కెమెరాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హేమలత, రైతు సంఘం సభ్యులు గోద జయన్న, చిన్న నాగేంద్రం, శ్రీనివాసులు, గోవిందు, పూర్వ విద్యార్థులు శేషన్‌గౌడు, ప్రకాష్‌గౌడు, రాజు, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కురుమూర్తి, నాగ మద్దిలేటి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జికి అర్ధరాత్రి మరమ్మతు



అయిజ: కర్నూల్–రాయచూరు రోడ్డుపై అయిజ పట్టణ సమీపంలో శుక్రవారం బ్రిడ్జిపై రంధ్రం పడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. శాంతి నగర్ సీఐ టాటా బాబు, అయిజ ఎస్ఐ విజయభాస్కర్ రెవెన్యూ, ఆర్ అండ్ బీ అధికారులు బ్రిడ్జిపై పడిన రంధ్రాన్ని శుక్రవారం అర్ధరాత్రి పూడ్చి వేశారు. రెండు ట్రాక్టర్ల తారును, రోడ్డు రోలర్‌ను తెప్పించి మూడు గంటలపాటు శ్రమించి వెంటనే మరమ్మతు చేపట్టి రహదారిపై రవాణాను పునరుద్ధరించారు. అధికారులు అర్ధరాత్రి స్పందించి మరమ్మతు పనులు చేపట్టినందుకు ప్రజలు అభినందించారు.

శిథిలావస్థ గృహాలు ఖాళీ చేయండి



మానవపాడులో పాతఇండ్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

మానవపాడు: మండల కేంద్రంలోని శిథిలావస్థ గృహాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లో నివాసగృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శిథిలావస్థ పాతఇండ్లకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, కలెక్టర్ ఆదేశాలను శిథిలావస్థ ఇండ్లలో ఉండరాదని తెలిపారు. పాతఇండ్లలో నివసించే వారి బంధువుల ఇండ్లకుగానీ, గ్రామ పంచాయతీ కార్యాలయంలో గానీ వసతి ఏర్పాటు చేశామని, సురక్షత ప్రాంతాలలో నివాసం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల నిరసన



లింగస్‌వాయిలోని పాఠశాల దగ్గర నీళ్లతో కూడిన బురదలో విద్యార్థుల తల్లి దండ్రులు

అలంపూర్ రూరల్: బురద మయంగా స్కూలు దారి ఉంటే, విద్యార్థులు స్కూల్‌కు ఎలా వెళ్తారని సీపీఎం జిల్లా నాయకులు జీకే ఈదన్న అధికారులను ప్రశ్నించారు. మండలంలోని లింగస్‌వాయి ఎంపీపీఎస్ పాఠశాల మొత్తం వర్షం నీళ్లకు నడిచేందుకు వీలు లేకుండా బురదమయంగా మారిందన్నారు. పాఠశాలకు విద్యార్థులు నడిచి వెళ్లేందుకు వీలు లేకుండా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల దగ్గర శనివారం నిరసన చేపట్టారు. రోజుల తరబడి విద్యార్థులు బురదలోనే నడుస్తున్నా విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదని జీకే ఈదన్న అన్నారు. గ్రౌండ్ మొత్తం బాగు చేయకుంటే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి స్థానిక విద్యాధికారి కార్యాలయం ముందు ధర్నా చేస్తామని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కిరణ్‌కుమార్, రామకృష్ణ, మౌలాలి, ఆంజనేయులు, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీఆర్‌పీఎఫ్ కన్వీనర్ సుధాకర్

అయిజ: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని, వెంటనే ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్ అన్నారు. శనివారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎమ్మార్సీ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. మండలంలోని చిన్న తాండ్రపాడు గ్రామంలో 150 మంది విద్యార్థులకు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రాజు, మురళి, విజయ్, సూర్య, పవన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను నిత్యం బడికి పంపాలి

శాంతినగర్: పిల్లలను ప్రతిరోజు బడికి పంపితేనే పాఠాలు అర్థమవుతాయని, క్రమం తప్పకుండా పంపాలని సీఆర్‌పీఎఫ్ కన్వీనర్ సుధాకర్ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సీఆర్‌పీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

మందుబాబులపై చర్యలు తీసుకోండి



పాఠశాల ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మద్యం తాగి విద్యాలయాలను అపవిత్రం చేస్తున్న మందుబాబులపై చర్యలు తీసుకోవాలని తనగల గ్రామస్తులు కోరుతున్నారు. వడ్డేపల్లి మండలంలోని తనగల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల ముందు ప్రతినిత్యం మందుబాబులు పాఠశాలలో రాత్రి వేళల్లో మద్యం తాగడం పరిపాటిగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తప్పతాగి సీసాలు పగలగొట్టడం, మిగిలిన తినుబండారాలు అక్కడే వదిలేసి అపరిశుభ్రం చేస్తున్నారని, ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు వాటిని చూసి అవాక్కవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై విద్యాశాఖ, పోలీసుశాఖ అధికారులు స్పందించి మందుబాబులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించి సంబంధిత వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మౌలాలి పీర్లకు నీరాజనం



మానవపాడులో మౌలాలి పీరును ఊరేగిస్తున్న భక్తులు

మానవపాడు: మండల కేంద్రంలోని మౌలాలి సామి పీర్లకు భక్తులు, ప్రజలు అడుగు అడుగున నీరాజనం పట్టారు. శనివారం ప్రత్యేకంగా మౌలాలిసామి పీర్ల ఊరేగింపులో భక్తులు ఎక్కువగా సంఖ్యలో దట్టీలు అందజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ చంద్రకాంత్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, పోలీస్‌లు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహులు

అయిజ: మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల్యం పిల్లల హక్కు అని, పిల్లలు స్వేచ్ఛా వాతావరణంలో పెరగాలన్నారు. ఆడపిల్లలను గౌరవించాలని, సోదర భావం కలిగి ఉండాలని అన్నారు. లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు బాలల లైంగిక నిరోధక చట్టం 2012లో రూపొందించారన్నారు. బాలలు వేధింపులకు గురైతే 100 లేదా 1098కి ఫోన్ చేయాలని సూచించారు. పిల్లలు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ అవుట్ రిచ్ వర్కర్ ప్రకాష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉమెన్ హబ్ చిట్టెమ్మ, సఖి కేంద్రం నిర్వాహకులు కవిత, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కృష్ణ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కార్మికశాఖ కార్యాలయం



శిథిలావస్థకు చేరిన కార్మికశాఖ కార్యాలయంలోని పైకప్పు

జిల్లా కేంద్రంలోని కార్మికశాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కార్యాలయంలోని గదులు వర్షపు నీటితో తడుస్తున్నాయి. కార్యాలయం మొత్తం చిత్తడి చిత్తడిగా మారుతోంది. మరోవైపు పైకప్పు నుంచి నీరు కారుతుండడంతో ఫైల్స్ తడిసిపోతున్నాయి. దీంతో కొన్ని ఫైల్స్‌పై ప్లాస్టిక్ సంచులను కప్పారు. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ దృశ్యాలు శనివారం 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– గద్వాల అర్బన్



ఫైళ్లపై కప్పి ఉంచిన ప్లాస్టిక్ సంచులు



వర్షపు నీరు కారుతుండడంతో చిత్తడిగా మారిన కార్మికశాఖ కార్యాలయం